గంటి భానుమతి
శ్రీకాకుళం

# చిన్ని విక్రమార్కుడి కథ

**- గంటి భానుమతి**

ఉదయం ఎనిమిది గంటలకి వివేక్ ఫాక్టరికి వెళ్ళిపోయాడు. నేను చార్జ్ అయ్యి రంగం లోకి దిగాను. ఒంటి గంట కల్లా వంట అవ్వాలి పది, పదిన్నర కల్లా నానిగాడికి అన్నం పెట్టేయ్యాలి. అంతకన్నా ముందు నానిని తయారు చేసి, కూచోపెడ్తే పన్లకి అడ్డు రాకుండా ఉంటాడు.

మొట్ట మొదటిది - మిషన్ 1 - నానిని తయారు చేయడం.

నాని కాళ్ళకి బొమ్మలున్న కాన్వాస్ బూట్లు, తెల్ల ఫ్లానెల్ పొడుగు చేతుల చొక్కా పైజామా వేసి, మెడకి మందంగా ఉన్న బిబ్ కట్టి, మూడు చక్రాల సైకిల్ మీద కూర్చోపెట్టాను.

నాని అందరి పిల్లల్లాంటి వాడు కాదు, స్పాస్టిక్ చైల్డ్, కాబట్టి కాళ్ళల్లో, చేతుల్లో బలం, పట్టుత్వం తక్కువ. అసలు మామూలుగానే నడుస్తూ, నడుస్తూ పడిపోతాడు. యింక సైకిల్ మీద ఉంటే చెప్పనక్కర్లేదు.

అందుకని వాడి చేయి, కాలు ఎడమ వైపున సైకిల్ కున్న స్ట్రాప్‌లో దూర్చి గట్టిగా కట్టాను. కుడిచేతిని, కాలుని, ఫ్రీగా వదిలేసా. వీరమాతలాగా ఫీలయిపోయి వాడిని వరండాలో ఉంచి బయటకెళ్ళకుండా వరండా కటకటాల తలుపు వేసాను. అది పెద్ద గట్టి గడియ కాదు. కానీ, వేసాను.

అయితే ఓ నాలుగ రోజులుగా వరండా బయట సైకిల్ తిప్పడానికి, తొక్కడానికి గొడవ పెడ్తున్నాడు.

వరండా బయట పచ్చని పచ్చిక లేదు. గేటు వరకు సిమెంటు దారి. దానికి రెండు వైపులా ఇసక. అక్కడక్కడ గడ్డి ఉన్నా పెద్దగా లేదు.

నాని పడితే దెబ్బలు తగులుతాయి. గీరుకుపోతాయి. అందుకని వాడిని

బయటికి పంపడానికి యిష్టపడను.

నాని వరండాలో సైకిల్ తొక్కుతూంటే, నేను వంటింట్లో వంట ప్రయత్నంలో ఉన్నాను.

ఒక్క ఐదు నిమిషాలు ప్రశాంతంగా గడిచాయి.

ఈ లోపల పెద్ద శబ్దాలు వినపడ్తున్నాయి. సైకిల్‌తో తలుపుల్ని కొడుతున్నట్టుగా ఉన్నాడు. తలుపు తీసే ప్రయత్నం కావచ్చు. కానీ, శబ్దం మాత్రం భయంకరంగా వస్తోంది.

మా పైన ఉన్న వాళ్ళు, ఎదుటి క్వార్టర్‌లో ఉన్నవాళ్లు, నన్ను, నా రాక్షసత్వాన్ని తిట్టుకుంటారో ఏమో కూడా తెలీదు.... కానీ.....తప్పదు, తలుపు తీయను.

నాలుగు రోజుల క్రితం ఓసారి ఇలాగే తలుపు తీసాను – ఆ శబ్దాలు భరించలేక దానితో వాడికి కోపం వచ్చి, నోటితో శబ్దాలు చేస్తూ, అరుస్తూ సైకిల్ని నా మీదకి తీసుకొచ్చి, నాలుగైదు సార్లు గట్టిగా తగిలించాడు.

అందుకని ఇప్పుడు తలుపుతీసే ప్రయత్నం విరమించుకున్నాను. మీ అబ్బాయని జాలి పడకండి. జాలి చూపించకండి. వాళ్ళంతటి వాళ్ళే నేర్చుకుందామని అనుకుంటారు. మీరు కొంచెం కర్కశంగా ఉండండి. మీ బాబు స్వతంత్రం కావాలని అనుకుంటాడు. తనే స్వంతంగా అన్ని చేయాలని అనుకుంటాడు. మీ బాబు చేయలేడు అని మీరు అనుకున్నవి అన్నీ కూడా చేయగలడు. అయితే దానికి కొంత సమయం పడ్తుంది. తాను చేయాలనుకున్న పనులు, చేసే ప్రయత్నాలు చూడడానికి మీకు కష్టంగా ఉండచ్చు. కానీ వాళ్ళకి ఉండదు. బాబుని ఫ్రీగా వదిలేయండి. దెబ్బలు తగలకుండా ఫుల్‌గా బట్టలు వేయండి. అతను నార్మల్ బేబి కాదు కాబట్టి, కొంచెం గమనిస్తుండాలి. సేఫ్‌సైడ్ కోసం. అది మనకి తెలిసిందే కదా!" డాక్టరుగారి మాటలు గుర్తొచ్చాయి.

కూరముక్కలు తరిగి, చుక్కకూర బాగుచేసి కడిగి వంటింట్లోంచి, ముందు డ్రాయింగ్ రూంలోకి వచ్చాను.

నన్ను చూస్తే గొడవ చేస్తాడని నాకు తెలుసు. అందుకని, వరండాకి డ్రాయింగ్ రూముకి మధ్యనున్న పెద్ద కిటికీకి ఉన్న తెర పక్కకి కొంచెం తప్పించి బయటికి చూసాను.

తలని ఓ వైపు వాల్చి, ఫోర్స్‌గా ముందు చక్రంతో తలుపుల్ని కొడుతున్నాడు.

తలుపు తీయడానికి వాడు చేసే ప్రయత్నం చూస్తు అలా కర్టెన్ వెనక్కాల ఎంత సేపున్నానో!

అసాధ్యమైన పనిని చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ యుద్ధంలో గెలుస్తాడా!

ఆ తలుపు తీయాలంటే, రెండు చేతులు సరిగ్గా ఉండాలి. ఓ చేత్తో ఓ తలుపు చెక్కని నొక్కాలి. మరో చేత్తో గడియని పక్కకి లాగాలి. కానీ, ఈ రెండు పనులు నానికి చాలా కష్టం.

నాని మెదడు సరిగా ఎదగలేదు. అవయవాలలో కోఆర్డినేషన్ తక్కువ. కాళ్లు చేతులు చెప్పినట్టుగా వినవు. ఏడేళ్ళ వాడే అయినా మూడు నాలుగేళ్ళ వాడిలాగా ఉంటుంది. వాడి బిహేవియర్. ఇప్పుడిప్పుడే పట్టుకోవడం అదీ బాగా వచ్చింది. ఇంకా స్కూలుకి వెళ్ళడం లేదు. వచ్చే సంవత్సరం వాడిని, దగ్గర్లోనే ఉన్న 'ఆత్మీయ'కి వెళ్ళి చేర్పిద్దామని అనుకుంటున్నాను. ఆ స్కూలు వీడిలాంటి వాళ్ళ కోసమే.

నాని తలుపు వైపుగా మొహం పెట్టి ఉన్నాడు. నేను ఊహించగలను, వాడు ఎలా ఉంటాడో.

తెరిచిన నోరు, దూరం దూరంగా ఉన్న పళ్లు, జారిన కింద పెదవి, బయటికి వచ్చేసిన నాలుక, ఆగకుండా కారే చొంగ.

సీరియస్‌గా వాడు ఏ పని చేస్తున్నా ఇలాగే ఉంటుంది వాడి మొహం.

చాలాసేపు తల ఎత్తి, చెయ్యి చాచి తలుపు తీసే ప్రయత్నంలో ఉండడం వలన కాబోలు భుజాలు మెడ నొప్పి చేసి ఉంటాయి. హఠాత్తుగా చేయి కిందకి

దించాడు.

"హమ్మయ్య అపాడు ఈ సారికి ఈ ప్రయత్నం చాలు. రేపు మళ్ళా ప్రయత్నించు." అని వాణ్ణి దగ్గర తీసుకుని చెప్దామనిపించింది.

విక్రమార్కుడిలాగా మళ్ళా చేయి చాచి గడియ తీయడానికి ప్రయత్నం మొదలెట్టాడు. ఈ ప్రయత్నంలో రెండుసార్లు సైకిల్ హేండిల్ వాడి మోచేతికి తగిలింది. గట్టిగా ఒక్కసారి ఏడిచి, మళ్ళా అపేసాడు. బుగ్గల మీద కన్నీటి చారలు.

వాడి కష్టతరమైన యుద్ధాన్ని చూడలేక వంటింట్లోకి వెళ్ళిపోయాను. కుక్కర్‌లో అన్నం, పప్పు, కూరముక్కలు పెట్టి చపాతీలకి పిండి కలిపి, గిన్నెలు అవీ సర్దుకుని మళ్ళీ కిటికీ దగ్గరి కొచ్చాను. కర్టెన్ తప్పించి వరండాలోకి చూసాను.

ఎడమ చెయ్యి స్ట్రాప్ వచ్చేసింది. రెండు చేతులూ ఫ్రీ కానీ, ఒక్కలాగా పనిచెయ్యదు, మానలేదు. కింగ్ బ్రూస్. తలుపు తీసే ప్రయత్నంలో ఉన్నాడు.

"ఇవాళ్ళే ఆఖరి రోజు కాదు కదమ్మా! ఇంకా బోలెడు రోజులున్నాయి. అప్పుడు నీక్కొంచెం బలం వస్తుంది. అప్పుడు తలుపుని నీ అంతట నువ్వే తియ్యెచ్చు" అని వాడికి అర్థం అయ్యే భాషలో చెప్పాలనిపించింది.

కానీ, అలా చేస్తే వాడి ఫైటింగ్ స్పిరిట్‌ని చంపేసినట్లవుతుందేమో!

వాడి ప్రయత్నం చూస్తే తీస్తాడు అనిపించింది. వాడో గొప్ప సోల్జర్, ఫైటర్, ఓటమిని అంగీకరించని వీరుడు. ఇప్పుడు కాకపోతే రేపయినా తీస్తాడు.

ప్రతి వీరుడు గ్రీకులాగానో, రోమన్ లాగానో ఉండాలి. గెలిచేశక్తి పోరాడే గుణం, ఓటమి అంగీకరించని వీరత్వం ఉండాలి అని జెఫర్సన్ అన్నాడు, సరిగ్గా ఇవే గుణాలు నా చిన్ని గ్రీకు వీరుడిలో ఉన్నాయి.

ఒక్కసారిగా వాడి నోట్లోంచి వచ్చే శబ్దాలు, సైకిల్ శబ్దం ఆగిపోయాయి.

కర్టెన్‌ని యింకొంచెం పక్కకి తప్పించాను భయంగా ఏం జరిగిందో అని.

నాని, నిశ్శబ్దంగా తలుపుకి అవతల ఉన్న సిమెంట్ దారి మీద ఓ నల్లమచ్చల తెల్లపిల్లి తాపీగా కూచుని ఉంది. దాన్ని చూస్తున్నాడు.

అది ముందుకు కదిలి తలుపు వరకూ వచ్చి కటకటాల్లోంచి కుతూహలంగా తొంగి చూసింది.

ఒక్కసారి భయంతో వెనక్కి సైకిల్ని జరపబోయి ఓ పక్కకి ఒరిగాడు. ఆ కదలికకే పిల్లి ఒక్క గెంతుతో తలని విదిలించి పరిగెత్తింది.

భయంతో గట్టిగా ఏడ్చాడు. దిక్కులు చూసాడు. చొంగతో బిబ్ అంతా తడిసింది. ఏడవడంతో బుగ్గలు రెండు కూడా తడిసాయి.

కన్నీరు తుడుద్దామనిపించింది. అలా చేస్తే వాడికి ఇంకా కోపం వస్తుంది.

ఈ లోపల సైకిల్ కూడా స్లోమోషన్‌లో జారుతూ జారుతూ పెద్ద శబ్దం చేసింది. సైకిల్ హాండిల్ ఓ చక్రంలోకి వెళ్ళింది. అది చూసి ఏడుపు ఆపాడు.

హాండిల్‌ని చక్రంలోంచి తీసే ప్రయత్నంలో గట్టిగా ఊపిరి పీలుసున్నాడు.

వాడి ప్రయత్నంలోని ప్రతీ కదలిక నాలోని కండరాల్ని కదిలించేస్తోంది.

వాడికి తోచినట్లగా హాండిల్‌ని తియడానికి ప్రయత్నించే విధానం చూస్తే ఆశ్చర్యం వేసింది. వాడు మానసిక వికలాంగుడు కాదు. తెలివి ఉంది అని అనిపించింది.

"మీకు తెలుసో లేదో, ఈ సృష్టిలో మనిషి ఒక్కడే భౌతికంగా ఏ పరికరం లేనివాడు. పక్షుల్లాగా ఎగరలేడు. చిన్న పురుగుతో కూడా మృత్యువాత పడచ్చు. చిరుతలాగ ఉండలేడు. మొసలి లాగా ఈదలేడు. కోతుల్లాగ ఎక్కడం రాదు. గద్దలాంటి దృష్టిలేదు. పులి లాగా పదునైన కత్తి లాంటి గోళ్ళు, పళ్ళు లేవు. కానీ మనకి ప్రకృతి ఓ వరం యిచ్చింది. గొప్ప వరం – ఆలోచించడం. ఇక్కడ మనకి నానికి పెద్దద తేడాలున్నాయని అనుకోకండి. సుత్తి గాజుని విరగకొట్టగలదు, ఇనుమును వంచగలదు. అక్కడే వివేకం పనిచేస్తుంది. ఇది

కొంతమందికి పుట్టుకతో ఉంటే, కొంత మందికి పరిసరాల పరిస్థితులు నేర్పిస్తాయి. ఇది మనకి నానికి తేడా" అన్న డాక్టరు మాటలు గుర్తొచ్చాయి.

బాబుని ఫ్రీగా వదిలేస్తే వాడు నేర్చుకోగలిగినంత నేర్చుకుంటాడు.

ఇప్పుడు వాడు చేస్తున్న ప్రయత్నం ఫలించాలి. అదే జరిగింది. ఆఖరికి ఆ హేండిల్ తీసాడు. ఎందుకో వెనక్కి చూసాడు. ఆ కళ్ళల్లో టైగర్ హిల్స్‌ని జయించిన ఇండియన్ ఆర్మీ లాంటి గర్వం......

ఫోన్ మోగింది.

ఒక్కసారి తెర వదిలాను.

ఫోన్ వెంటనే తియ్యాలి. లేకపోతే వాడి ఏకాగ్రతకి భంగం కలుగుతుంది. అక్కడికి వెళ్ళేలోగా వీడి కేదయినా అయితే.....

అయిష్టంగానే ఓ రెండు అంగల్లో డైనింగ్ రూంలో ఉన్న ఫోన్ తీసాను.

అక్క విజయవాడ నుంచి ఫోన్ చేసింది.

"ఏం చేస్తున్నారు తల్లీ కొడుకులు?" అంది.

"వంట ప్రయత్నం, నానికి పది గంటలకి అన్నం పెట్టాలి. ఏంవున్నాయి విశేషాలు?"

"మా వాడికి కాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం దొరికిందే....." అంది సంతోషంగా.

"అప్పుడేనా! ఇంకా చదువుంది కదే......"

"రోజులు మారాయమ్మా, చదువు అవుతుండగానే ఉద్యోగం......"

"శుభవార్తే మరి! నాకు ఇంకా మనం అంతా వాడి ఎంసెట్ గురించి, కాలేజీల గురించి, బ్రాంచ్‌ల గురించి మాట్లాడుకున్నది నిన్న మొన్న లాగా ఉంది. అప్పుడే ఉద్యోగమా! ఇంతకీ ఎక్కడ ఆఫర్?"

తలుపు శబ్దం వినవస్తూనే ఉంది. ధన్...ధన్...ధన్......

"టీ.సి.ఎస్.లోట చదువయ్యాకే జాయినవడం అనుక్కో జీతం అన్నీ కలిపి నెలకి ఇరవయి వేలు పైనే. ఇంత వయసొచ్చిన మా ఆయనకే అంత లేదు....."

మనసంతా నాని మీదే ఉంది. తర్వాత వాడు పడుక్కున్నాక మాట్లాడుకుందాం అంటే దాని ఉత్సాహం మీద నీళ్ళు చల్లినట్లవుతుందనిపించింది. 'దాని కొడుకు ఎలాగు సరిగా లేదు నా కొడుకు

అభివృద్ధిని ఓర్వలేకపోతోంది. ఈర్ష్య" అని అనుకుంటుందేమో.

డైనింగ్ రూం నుంచి ఫోన్ ఎంతవరకూ వస్తుందో అంత వరకూ లాగి ఫోన్‌ని కింద పెట్టాను. రిసీవర్ని అలాగే ఉంచుకొని గుమ్మం వరకూ వచ్చి వరండాలోకి తొంగి చూసాను.

వరండాకి, డ్రాయింగ్ రూంకి మధ్య ఉన్న తలుపుకి ఉన్న కర్టెన్ వల్ల క్లియర్‌గా, పూర్తిగా కనపడటం లేదు.

కర్టెన్ ఊగుతూ పైకి వెళ్ళినప్పుడల్లా కనిపిస్తోంది. అది కూడా కొంచెం. అందుకని, కింద మోకాళ్ళ మీద కూచున్నాను.

సైకిల్‌తో తలుపుని కొడ్తున్నాడు. తలుపు గడియ ఊగుతోంది. సినిమాల్లోల్లాగా తలుపు అటూ ఇటూ ఊగుతోంది.

"ఏమే..... ఉన్నావా...... ఉ:.....అ:..... అనడం లేదు. నానిగాడు ఏం చేస్తున్నాడు?"

ఏదో చెప్దామని అనుకుంటూండగానే పెద్ద శబ్దం అయింది. తలుపు తెరుచుకున్న శబ్దం. సైకిల్ రామ్ మీద నుంచి, మెట్ల మీద నుంచి జారిన శబ్దం. నాని ఏడుపు క్రమాలంకారంలో వినపడింది.

ఒక్కసారి వణికిపోయాను. ఏం జరిగిందో అని ఇంకా కిందకి వంగాను. సైకిల్ కింద పడి ఉంది. వాడు అక్కడే కూచుని ఏడుస్తున్నాడు.

"అక్క... ఓ పని చెయ్యి... తర్వాత మాట్లాడుదాం. నాని పడ్డట్టున్నాడు" అంటూ దాని సమాధానం కోసం ఎదురు చూడకుండా ఫోన్ పెట్టేసి రెండడుగులు వేసానో లేదో, కాలు కింద పెట్టిన ఫోన్ మీద పడింది. దాన్ని ఓ పక్కగా గోడ వారకి పెట్టాను. పరుగున కర్టెన్ తీసుకుని వరండాలోకి వెళ్ళి ఓ వారగా నుంచున్నాను.

క్రింద పడి ఉన్న సైకిల్‌ని తీస్తున్నాడు. ఇప్పుడు ఏడుపు లేదు. తల ఓ వైపు వాల్చాడు. నోరు తెరిచి ఉంది. చొంగ కారిపోతోంది. గడ్డం, మెడ, చొక్కా తడిసిపోయి ఉన్నాయి.

నుదుటి మీద గీతలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. చేతి వేళ్ళ మీద, చెవుల మీద, చెంపల పక్కన గీరుకుపోయినట్లుగా రక్తం, సిమెంట్, తెల్ల తెల్లటి చారలున్నాయి.

కళ్ళల్లో నీళ్ళున్నాయి. అయినా అవేవి వాడు సైకిల్ ఎక్కడానికి చేసే

ప్రయత్నానికి అడ్డు రాలేదు.

రిక్షావాడిలాగా అడ్డం దిడ్డంగా నడుపుతూ, దాన్ని ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాడు.

వంటింట్లో ఆపేసిన పని గుర్తొచ్చింది. గోడ గడియారాన్ని చూస్తూ లోపలికెళ్ళాను.

ఓ పది నిమిషాలయ్యాక మళ్ళా వరండాలోకి వచ్చి, గోడ చాటున నుంచుని కటకటాల్లోంచి బయటికి చూస్తున్నాను.

అద్భుతమైన దృశ్యం.

నాని సైకిల్‌ని లాగడం లేదు. తొక్కుతున్నాడు.

వాడి తల ఓ వైపు వాలి లేదు. భుజాలమీద నిటారుగా ఉంది. గర్వంతో, గడ్డం ముందుకు పొడుచుకొచ్చినట్లుగా ఉంది. నోరు తెరిచే ఉంది. ఏడుపుతో కాదు. సంతోషంతో, నవ్వుతూ జారని కన్నీటితో, కళ్ళు నీలాల్లాగా మెరుస్తున్నాయి. ధారగా జారుతున్న చొంగలో జాలువారుతున్న ముత్యాలు. యుద్ధంలో గెలిచిన అలెగ్జాండర్ లాగా ఉన్నాడు. పాంపేని చంపేసి, కొడుకుల్ని ఓడించి విని, విడి, విసి అన్న సీజర్ యిప్పుడు.

వాడిలో చంద్రుడి మీద సైకిల్ నడిపినంతటి గర్వం. అది చూచి నాలో ఓ అనిర్వచనీయమైన ఉద్వేగం.

స్వాతంత్ర్యం పొందిన రాత్రి, జాతీయ గీతం ఆలపిస్తూంటే, ప్రతి భారతీయుడి కడుపులో ఉండలు చుట్టుకుపోతున్న లాంటి గర్వం అది. నా గొంతు వరకూ వచ్చి ఆగిపోయింది.

'బ్రేవో, మైసన్! బ్రేవో య్యేస్! యూ గాటిట్!' అని అనుకున్నాను.

(రచన జనవరి 2007 కథా పురస్కారం బహుమతి పొందిన కథ.)